క్లుప్తంగా

హోమియో వైద్య శిబిరానికి స్పందన



హోమియో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ కల్యాణి

అగనంపూడి: లయన్స్ క్లబ్ అగనంపూడి ఆధ్వర్యంలో స్థానిక హోమీ వైద్యశాల, విజన్ కేర్ పర్యవేక్షణలో ఉచిత హోమియో, నేత్ర వైద్య శిబిరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా లయన్స్‌క్లబ్ జిల్లా చైర్‌పర్సన్ గుదే సుశీలా గజేంద్రరావు మాట్లాడుతూ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించే సేవా కార్యక్రమాల్లో భాగంగా వైద్యశిబిరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అగనంపూడి ప్రభుత్వ హోమియో వైద్యురాలు డాక్టర్ కళావతి మాట్లాడుతూ అగనంపూడి ఆస్పత్రిలో అన్ని రకాల దీర్ఘకాలిక రోగాలకు మందులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. వైద్యులు కె.శివకుమార్, కె.జోగి నాయుడు, అగనంపూడి లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు ఎం.జగదీష్, నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా గౌరీ పరమేశ్వరుల అనుపు ఉత్సవం



ఉత్సవ విగ్రహాలను ఊరేగిస్తున్న ప్రతినిధులు

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 69వ వార్డు నాతయ్యపాలెంలో గౌరీ పరమేశ్వరుల అనుపు మహోత్సవం ఘనంగా జరిగింది. గౌరీ సేవా సంఘం ఆధ్వర్యంలో డప్పు వాయిద్యాలు, తప్పెట గుళ్ల, బాణసంచా నడుమ గౌరీ పరమేశ్వరుల ఉత్సవ విగ్రహాలను నాతయ్యపాలెం, అక్కిరెడ్డిపాలెంలో ఊరేగించారు. కార్యక్రమంలో శ్రీ గౌరీ సేవాసంఘం అధ్యక్షుడు దాడి వెంకటరమేష్, ఉపాధ్యక్షుడు కాండ్రేగుల జగ్గప్పారావు, కార్యదర్శి కాళ్ల రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

76వ వార్డు బీజేపీ అధ్యక్షుడిగా రమణ

పెదగంట్యాడ: బీజేపీ 76వ వార్డు అధ్యక్షుడిగా జీలకర్ర రమణ నియమితులయ్యారు. వార్డు పరిధి బాలచెరువులోని కల్యాణ మండపంలో శనివారం నిర్వహించిన పార్టీ సమావేశంలో బీజేపీ గాజువాక నియోజకవర్గ కన్వీనర్ కరణం రెడ్డి నర్సింగరావు మాట్లాడారు. పార్టీ వార్డు అధ్యక్షునిగా రమణను నియమించారు. కార్యక్రమంలో జీలకర్ర భువనేశ్వరి, ఉమామహేశ్వరరావు, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఐక్య పోరాటాలతో విజయం

కూర్మన్నపాలెం: ఉక్కు పరిరక్షణ కోసం కార్మికులు పట్టు వదలక చేస్తున్న పోరాటానికి కేంద్ర ప్రభుత్వం సమాధానమివ్వాలని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద చేపడుతున్న రిలే నిరాహార దీక్షలు శనివారం నాటికి 1031వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో సంస్థకు చెందిన ఎస్ఎంఎస్-1 విభాగ కార్మికులు కూర్చున్నారు. నాయకులు మాట్లాడుతూ ఐక్య పోరాటాలతో విజయం తథ్యమన్నారు.

యాచకుడి కాళ్లపై ఎక్కిన లారీ

అక్కిరెడ్డిపాలెం: డివైడర్ పక్కన రోడ్డుపై సేద తీరుతున్న యాచకుడి రెండు కాళ్లపై లారీ ఎక్కేయడంతో అతడికి తీవ్ర గాయాలయ్యాయి. ఘటనకు సంబంధించి గాజువాక ట్రాఫిక్ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. శనివారం గాజువాక 100 అడుగుల రోడ్డు మున్సిపల్ కార్యాలయానికి సమీపంలో డివైడర్ పక్కనున్న రోడ్డుపై యాచకుడు సేద తీరుతున్నాడు. ఇదే సమయంలో గంగవరం పోర్టుకు వెళ్లే ఒక లారీ యాచకుడి రెండు కాళ్లపై ఎక్కేసి ఆగిపోయింది. లారీ డ్రైవర్ గమనించకపోవడంతో, కొందరు అతడిని హెచ్చరించారు. దీంతో డ్రైవర్ లారీని అక్కడి నుంచి తీసి, ఆపకుండా గంగవరం పోర్టుకు వెళ్లిపోయాడు. ప్రమాదంలో యాచకుడి రెండు కాళ్లు నుజ్జవ్వడంతో స్థానికులు 108కు సమాచారం అందించారు.ఘటన స్థలానికి చేరుకున్న గాజువాక ట్రాఫిక్ పోలీసులు క్షతగాత్రుడిని 108లో కేజీహెచ్‌కు తరలించారు. ప్రమాదానికి కారణమైన లారీని గంగవరం పోర్టు లారీ యార్డులో గుర్తించిన పోలీసులు లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని, లారీని స్వాధీనం చేసుకున్నారు.





పట్టాలందిస్తున్న వైఎస్సార్‌సీపీ ఉమ్మడి విశాఖ జిల్లా కోఆర్డినేటర్ సుబ్బారెడ్డి, ఎమ్మెల్యే నాగిరెడ్డి (ఫైల్)

ఫలించిన నిరీక్షణ

హామీలు నీటి మీద రాతలుగా మారిన తరుణంలో.. మాట ఇస్తే తప్పక నెరవేర్చుతారు అనే భరోసా కల్పించింది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమేనని లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. దశాబ్దాలుగా అపరిష్కృతంగా ఉన్న సమస్య వైఎస్సార్‌సీపీ నాయకుల చొరవతో పరిష్కారమై.. ఫార్మా నిర్వాసితుల మేజర్ సన్స్‌కు పట్టాలు చేతికందడంతో వారు ఆనందంతో తబ్బిబ్బవుతున్నారు. జగనన్న ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.



నిర్వాసిత మేజర్ సన్స్‌కు అందించిన పట్టా



అగనంపూడి: దశాబ్దాల నిరీక్షణ ఫలించిన వేళ ఫార్మా నిర్వాసితుల కన్నుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. ఏళ్ల తరబడి నలుగుతున్న సమస్య కొలిక్కి రావడంతో వారు ఆనంద డోలికల్లో తేలియాడుతున్నారు. వైఎస్సార్‌సీపీ నేతల చొరవతో ఫార్మాసిటీ నిర్వాసితుల వివాహిత **కుమారుల (మేజర్ సన్స్)**కు పట్టాలు అందించ**డంతో వారి ఆనందానికి** ఆకాశమే హద్దయింది.

ఇదీ నేపథ్యం..

రెండున్నర దశాబ్దాల క్రితం **ఫార్మాసిటీ నిర్వాసిత** కాలనీలు లేమర్తి, అగ్ర**హారం, ఇ.కోనంగి, కొత్త** పాలెం, ఏదురువానిపాలె**ం గ్రామాలకు అగనం**పూడి రెవెన్యూ పరిధిలో **పునరావాసం కల్పించారు.** అప్పట్లో ఒకే ఇంట్లో త**ండ్రి, వివాహం జరిగిన** కుమారులు ఉమ్మడిగా **ఉండడానికి ఇబ్బందిగా ఉం**దని, వివాహిత కుమారు**లకు స్థలాలు కేటాయిం**చాలని ఏపీఐఐసీ, జిల్లా **రెవెన్యూ అధికారులకు** మొరపెట్టుకోవడంతో **మేజర్ సన్స్‌కు పట్టాలి**వ్వాలని నిర్ణయించారు. అయితే అర్హుల జాబితా విషయం కొలిక్కి రాకపోవడంతో రెండు దశాబ్దాలుగా సమస్య నలుగుతోంది.



మేజర్ సన్స్ కోసం కేటాయించిన స్థలం

ఎన్నికల సమయంలో నిర్వాసిత మేజర్ సన్స్‌కు పట్టాలివ్వడంతో పాటు ఉపాధి కల్పిస్తామని వైఎస్సార్‌సీపీ హామీ ఇచ్చింది. దీంతో ఈ సమస్యను కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకుడు ప్రసాద్ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, ఇన్‌చార్జ్ తిప్పల దేవన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే వైఎస్సార్‌సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డికి సమస్యను వివరించారు. ఆయన కలెక్టర్, ఇతర రెవెన్యూ అధికారుల సమన్వయంతో సమస్యను పరిష్కరించి, 2 వందల మందికి పట్టాలు మంజూరు చేశారు. ఏళ్లనాటి సమస్యకు పరిష్కారం దొరకడంతో నిర్వాసితుల్లో సంతోషం వ్యక్తం అవుతోంది.

గతంలో ఎవరూ పట్టించుకోలేదు



సుమారు 20 సంవత్సరాలుగా పాలకులు, అధికారుల చుట్టూ తిరిగాం. ఏపీఐఐసీ, రెవెన్యూ అధికారులకు మొరపెట్టుకున్నాం. కలెక్టర్‌కు నిర్వాసిత సంఘం తరఫున పలుమార్లు వినతులు సమర్పించాం. ఒకే ఇంట్లో అమ్మ నాన్నలు, వివాహం అయిన అన్నదమ్ములు ఉండడం వల్ల ఇబ్బందులు పడుతున్నాం. దాదాపు అందరిదీ ఇదే పరిస్థితి. చాలామంది వేరే ఇళ్లు అద్దెకు తీసుకుని ఉంటున్నారు. మేం పడుతున్న ఇబ్బందులను అధికారులకు విన్నవించాం. ఎట్టకేలకు వైఎస్సార్‌సీపీ నాయకుల చొరవతో సమస్య పరిష్కారమైంది.

– వై.రాజు, ఫార్మాకాలనీ

రెండు దశాబ్దాలుగా ఎదురుచూస్తున్నాం



మేము ఒకే ఇంట్లో ఎనిమిది మంది ఉండేవాళ్లం. స్థలం కోసం రెండు దశాబ్దాలుగా ఎదురు చూస్తున్నాం. పట్టాలిమ్మని టీడీపీ, కాంగ్రెస్ పాలనలో ఎమ్మెల్యేలు, మంత్రులను కలిసి విన్నవించాం, కానీ ప్రయోజనం లేకపోయింది. స్థానికంగా చిన్న సమస్యలు ఉండటంతో, అధికారులు ఆ కారణం చూపేవారు. ఏం చేయాలో దిక్కు తోచని స్థితి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మా సమస్యను పరిష్కరించింది. సొంత గూడు కట్టుకునే అవకాశం కల్పించిన కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మి, ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డికి రుణపడి ఉంటాం.

– వై.గోవింద్, లేమర్తి కాలనీ

రూ.25 లక్షల ఆస్తి దక్కింది



మాకు ఇచ్చిన స్థలం విలువ రూ.25లక్షలు ఉంటుంది. స్థలం దక్కుతుందని మేం అసలు అనుకోలేదు. వైఎస్సార్‌సీపీ పాలకుల చొరవ వల్ల మాకు అదృష్టం కలిసొచ్చింది. వారు చేసిన మేలు మా కుటుంబ సభ్యులం మర్చిపోలేం.

– కె.శ్రీను, నిర్వాసితకాలనీ

సమస్య పరిష్కరించామనే సంతృప్తి



ఫార్మా నిర్వాసితులు పడుతున్న ఇబ్బందులను ఎమ్మెల్యే నాగిరెడ్డి దృష్టికి తీసుకువెళ్లాం. ఆయన, వైఎస్సార్‌సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి చొరవ తీసుకుని కలెక్టర్, జేసీలతో, రెవెన్యూ ఉన్నతాధికారులతో చర్చించారు. సమస్య పరిష్కారం అయ్యేలా కృషి చేశారు. నిర్వాసితుల సమస్యను పరిష్కరించగలిగామనే సంతోషం మాకు దక్కింది.

– ఇల్లపు వరలక్ష్మి, కార్పొరేటర్

ధనుర్మాసోత్సవాల కరపత్రాల ఆవిష్కరణ

అగనంపూడి: జీవీఎంసీ 79వ వార్డు అగనంపూడి శాంతినగర్‌లోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 16 నుంచి ధనుర్మాసోత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ చారి తెలిపారు. నెలరోజుల పాటు నిర్వహించనున్న ఉత్సవాలకు సంబంధించిన కరపత్రాన్ని ఆలయంలో శనివారం కమిటీ ప్రతినిధులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చారి మాట్లాడుతూ 16వ తేదీన రాత్రి 12 తరువాత ప్రారంభమయ్యే నెలగంట (ధనుర్మాసం) పూజలు 17వ తేదీ తెల్లవారుజాము నుంచి ప్రారంభమవుతాయన్నారు. 23న ముక్కోటి ఏకాదశి, వచ్చేనెల 8న మంగళాశాసన పాశురం, గొబ్బిళ్ల పూజ, 10న స్వామి వారి తిరువీధి, 11న కూడార్పై విశేష పాశురం, 14న గోదా రంగనాథుల కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు గొల్లవిల్లి కనక భవానీ, మారిశ సత్యవేణి, లక్ష్మి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు

రోడ్డు ప్రమాదంలో వ్యాపారికి తీవ్ర గాయాలు

అక్కిరెడ్డిపాలెం: పీచు మిఠాయి విక్రయించేందుకు వెళ్తున్న వ్యాపారిని వేగంగా వస్తున్న కారు వెనుక నుంచి ఢీకొనడంతో తీవ్రగాయాలపాలయ్యారు. గాజువాక పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. 69వ వార్డు నాతయ్యపాలెంకు చెందిన గోకులపాటి కనకరాజు (32) ఇంటి వద్దనే పీచుమిఠాయి తయారు చేసి, చిన్నచిన్న దుకాణాలకు విక్రయిస్తుంటాడు. శనివారం ఉదయం పీచుమిఠాయి తీసుకుని ఎస్ఏడీలో షాపులకు డెలివర్ చేయడానికి షీలానగర్ దాటి ఎయిర్‌పోర్టు వైపు వెళ్తుండగా వెనుక నుంచి వేగంగా వచ్చిన కారు రోడ్డు పక్కనున్న రిటైనింగ్ ఐరన్ గార్డ్‌లను ఢీకొడుతూ .. టీవీఎస్ మోపెడ్‌పై వెళ్తున్న కనకరాజు వాహనాన్ని బలంగా ఢీకొంది. దీంతో కనకరాజు సేఫ్టీగార్డ్స్ పై నుంచి రోడ్డు పక్కనున్న తుప్పల్లో పడి గాయాలపాలయ్యారు. క్షతగాత్రుడిని 108 వాహనంలో గాజువాకలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. కారు డ్రైవర్ మద్యం సేవించి ఉన్నట్లు ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు.



గాయాలపాలైన కనకరాజు

భయం వీడితే.. విజయం మీదే

టెన్త్ విద్యార్థులకు వ్యక్తిత్వ వికాస నిపుణుల సూచన

పెదగంట్యాడ: పరీక్షలంటే భయం వీడితే విజయం మీదేనని విద్యార్థులకు సూచించారు వ్యక్తిత్వ వికాస నిపుణులు. పారిశ్రామిక ప్రాంత ప్రైవేటు పాఠశాలల సంఘం (జిప్సా) ఆధ్వర్యంలో స్థానిక బీసీ రోడ్డులోని టీఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో పదో తరగతి విద్యార్థులకు పరీక్షలపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. పరీక్ష రాసే విధానం, ఒత్తిడిని జయించడం తదితర అంశాలపై పలువురు నిపుణులు అవగాహన కల్పించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ కష్టపడి కాకుండా ఇష్టపడి చదివితే మంచి ఫలితాలు సాధించవచ్చన్నారు. జిల్లా ఉప విద్యా శాఖాధికారి గౌరీ శంకరరావు మాట్లాడుతూ వచ్చే ఏడాది మార్చిలో పదో తరగతి పరీక్షలు ఉంటాయని, ఈ పరీక్షలకు విద్యార్థులు ఇప్పటి నుంచే సన్నద్ధం కావాలన్నారు. ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుడు వేణు కల్యాణ్ మాట్లాడుతూ విద్యార్థి దశలోనే ఉన్నత లక్ష్యాలను ఏర్పరుచుకోవాలని, వాటిని సాధించే దిశగా ప్రయత్నం చేయాలని తెలిపారు. సదస్సుకు సుమారు 80 పాఠశాలల నుంచి 1000 మంది విద్యార్థులు హాజరయ్యారు. కార్యక్రమంలో జిప్సా అధ్యక్షుడు పాలవలస భాస్కరరావు, కార్యదర్శి బి.శ్రీనివాస్, కోశాధికారి డి.శ్రీనివాస్, వాసుదేవరావు, మురళీ, జగన్, వివిధ పాఠశాలల కరస్పాండెంట్లు పాల్గొన్నారు.



పదో తరగతి పరీక్షలపై అవగాహన కల్పిస్తున్న వ్యక్తిత్వ వికాస నిపుణుడు వేణు కల్యాణ్

పార్టీ పటిష్టతకు మరింత కృషి

జేసీఎస్ జిల్లా కో–ఆర్డినేటర్ పూర్ణానంద శర్మ

అగనంపూడి: పార్టీ ఆవిర్భావం నుంచి చేస్తున్న సేవలు గుర్తించి జిల్లా జేసీఎస్ కో–ఆర్డినేటర్‌గా తనకు అవకాశం కల్పించడం సంతోషంగా ఉందని రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ జి.పూర్ణానంద శర్మ (పూర్ణ) అన్నారు. పార్టీకి మరింత సేవ చేసే అవకాశం దక్కిందన్నారు. అగనంపూడిలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ తనను నమ్మి గురుతర బాధ్యత అప్పగించిందని, పార్టీ పటిష్టానికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు. తనకు అవకాశం కల్పించిన నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.



పూర్ణానందశర్మను అభినందిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

ఎమ్మెల్యే అభినందన

పెదగంట్యాడ: జేసీఎస్ జిల్లా కో–ఆర్డినేట ర్‌గా నియమితులైన పూర్ణానందశర్మను ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి శనివారం అభినందించారు. ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసిన పూర్ణ ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. జేసీఎస్ క్లస్టర్ ఇన్‌చార్జి కులుకూరి మంగరాజు, మండల అధ్యక్షుడు రాజాన వెంకటరావు, బొడ్డ గోవింద్ పాల్గొన్నారు.

రూ.92.4 లక్షలతో అభివృద్ధి పనులు



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి

పెదగంట్యాడ: నియోజకవర్గంలోని అన్ని వార్డులను అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. జీవీఎంసీ 64వ వార్డు యారాడలో రూ.38.72లక్షలతో, గంగవరం గ్రామంలో రూ.53.77 లక్షలతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా అన్ని వార్డుల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని చెప్పారు. ప్రతి వార్డులో తాగునీరు, సామాజిక భవనాలు, రోడ్లు, కాలువలను నిర్మిస్తున్నామని, వీటిని సకాలంలో పూర్తి చేసి వినియోగంలోకి తీసుకువస్తామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ దల్లి గోవింద్, నాగోతి మధు, సీహెచ్ వెంకటప్పారావు, బాబి, వాసు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రికి వినతి



రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌తో వ్యాసశర్మ

అగనంపూడి: విశాఖ ఉక్కును ప్రభుత్వరంగ సంస్థగా కొనసాగించాలని కోరుతూ ఏఐబీఎఫ్ రాష్ట్ర సమన్వయకర్త, వైఎస్సార్‌సీపీ నాయకుడు ధర్మాల వ్యాసశర్మ రైల్వేశాఖామంత్రి అశ్విని వైష్ణవ్‌కు వినతి పత్రంలో సమర్పించారు. విశాఖ పర్యటనకు విచ్చేసిన మంత్రిని కలిసిన ఆయన విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ అంశాన్ని ప్రస్తావించారు. 1030 రోజులుగా విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఆందోళనలు చేపడుతున్నా కేంద్ర ప్రభుత్వం స్పష్టమైన హామీ ఇవ్వకపోవడం వల్ల నిర్వాసితులు, ఉద్యోగులు, వీటిపై ఆధారపడి జీవనం సాగిస్తున్న వేలాది మంది ఆందోళనకు గురవుతున్నారని పేర్కొన్నారు. ప్రతీ నెలా ఒకటో తేదీన జీతాలు ఇవ్వలేని పరిస్థితి ఏర్పడడంతో కార్మికులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ఉక్కు సమస్యను ప్రధానమంత్రి మోదీ దృష్టికి తీసుకువెళ్లి శాశ్వత పరిష్కారం చూపించాలని వినతిపత్రంలో కోరారు.

బీఎస్సీ నర్సింగ్‌లో అడ్మిషన్లు

అక్కిరెడ్డిపాలెం: ఎంసెట్ పాసైన లేదా నీట్ పరీక్ష రాసిన పేద విద్యార్థులకు బీఎస్సీ నర్సింగ్ కోర్సులో అడ్మిషన్లు కల్పిస్తామని బొల్లినేని మెడ్ స్కిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్.నాగేశ్వరరావు శనివారం తెలిపారు. నాలుగేళ్ల బీఎస్సీ నర్సింగ్ కోర్సు పూర్తి చేసిన అనంతరం వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించి, కోర్సు ఫీజును జీతం నుంచి మినహాయిస్తామన్నారు. అలాగే డిగ్రీ పాసైన విద్యార్థులకు మూడు నెలల పాటు ఉచిత వసతి, భోజన సౌకర్యంతో కూడిన శిక్షణ అందించి కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. ఆసక్తి గలవారు షీలానగర్ కిమ్స్ ఐకాన్ హాస్పిటల్ క్యాంపస్‌లోని బొల్లినేని మెడ్ స్కిల్స్ కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9680945357, 9121999654, 7995013422 నంబర్లను సంప్రదించాలని తెలియజేశారు.

లోక్ అదాలత్‌లో 181 కేసుల పరిష్కారం

గాజువాక : కోర్టు కేసులను పరిష్కరించుకోవడానికి రాజీమార్గం ఎంతో ఉత్తమమని 13వ అదనపు జిల్లా న్యాయమూర్తి షణ్ముఖరావు అన్నారు. గాజువాక కోర్టు కాంప్లెక్స్‌లో శనివారం నిర్వహించిన జాతీయ మెగా లోక్ అదాలత్ శిబిరంలో ఆయన ప్రసంగించారు. రాజీ మార్గంలో కేసులను పరిష్కరించుకోవడం ద్వారా కక్షిదారులకు సమయం, ధనం వృథా కాకుండా ఉంటాయన్నారు. కక్షిదారుల మధ్య సంబంధాలు బలపడతాయన్నారు. గాజువాక లోని వివిధ కోర్టుల్లో గల 181 కేసులను ఈ శిబిరంలో రాజీమార్గం ద్వారా పరిష్కరించినట్లు కోర్టువర్గాలు తెలిపాయి. పరిష్కారమైన కేసుల విలువ రూ.3.79 కోట్లని పేర్కొన్నాయి. కార్యక్రమంలో న్యాయమూర్తులు ఇ.రాజేంద్రబాబు, వి.పల్లవి, వై.శ్రీలక్ష్మి, వై.ప్రేమలత, గాజువాక బార్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు కె.వి.స్వామి, బి.వి.ఎం.కృష్ణ, లోక్ అదాలత్ సభ్యులు ఆర్.సూర్యనారాయణ, విశ్వనాథ్, కె.సీతామహాలక్ష్మి, ఎ.సీతామహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



లోక్ అదాలత్ శిబిరంలో ప్రసంగిస్తున్న న్యాయమూర్తి షణ్ముఖరావు

వైభవంగా దానప్ప తల్లి సారె ఊరేగింపు



అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి



సారెను ఊరేగింపుగా తీసుకువస్తున్న భక్తులు

కూర్మన్నపాలెం: వడ్లపూడి దుగ్గపువానిపాలెం గ్రామంలోని దానప్పతల్లి సారె ఊరేగింపు, ముర్రాట మహోత్సవం శనివారం వైభవంగా జరిగాయి. వడ్లపూడి ఆర్‌హెచ్ కాలనీ, దుగ్గపువానిపాలెం, కాశీపాలెం, కణితి కాలనీ ప్రజలు అమ్మవారిని దర్శించుకుని పసుపు కుంకుమ, చీర, సారె సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు 108 కలశాలతో 508 రకాల పిండి వంటలతో సారెను ఊరేగింపుగా తీసుకువెళ్లి, అమ్మవారికి సమర్పించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉత్సవాల్లో ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, వైఎస్సార్‌సీపీ గాజువాక నియోజకవర్గ ఇన్‌చార్జి తిప్పల దేవన్‌రెడ్డి పాల్గొని, అమ్మవారికి పూజలు చేశారు. అన్నసమారాధనను ప్రారంభించారు. కార్యక్రమంలో సరళన కొండలరావు, డి.వి.అప్పారావు, బి.అప్పలసత్యం, మండల అధ్యక్షుడు బొడ్డ గోవింద్, సీనియర్ నాయకులు ప్రగడ వేణుబాబు, ప్రగడ శ్రీనివాస్, పూడి ఆనంద్, పిన్నింటి సంతోష్, ముద్దపు దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వంశీరెడ్డి జన్మదిన వేడుకలు

పెదగంట్యాడ: జీవీఎంసీ 74వ వార్డు కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి జన్మదిన వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. పెదగంట్యాడ జంక్షన్‌లోని ఆయన స్వగృహంలో నిర్వహించిన వేడుకల్లో ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, వైఎస్సార్ సీపీ గాజువాక నియోజకవర్గ ఇన్‌చార్జి తిప్పల దేవన్‌రెడ్డి వంశీరెడ్డితో కేక్ కట్ చేయించారు. పలువురు కార్పొరేటర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు వంశీరెడ్డికి గజమాలలు వేసి, పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

– వంశీరెడ్డి జన్మదినోత్సవం సందర్భంగా 65వ వార్డు వాంబే కాలనీలో శనివారం అన్నదానం చేశారు. మంత్రి మంజుల, దొడ్డి రమణ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.



వంశీరెడ్డితో కేక్ కట్ చేయిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి, దేవన్‌రెడ్డి

జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు ప్రారంభం

ఉక్కునగరం: స్థానిక త్రిష్ణా మైదానంలో శనివారం జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు ప్రారంభమయ్యాయి. జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహించనున్న పోటీలకు ముఖ్య అతిథిగా స్టీల్‌ప్లాంట్ స్పోర్ట్స్ విభాగం ఇన్‌చార్జి సీజీఎం డాక్టర్ కె.హెచ్.ప్రకాశ్ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ కబడ్డీ ప్రాచీన క్రీడ అని, దానిని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. క్రీడా స్ఫూర్తితో పోటీల్లో పాల్గొని విజేతలుగా నిలవాలన్నారు. వి.ఎస్.ఎం.గ్రూప్ చైర్మన్ మహేష్ క్రీడాకారులకు అభినందనలు తెలిపారు. నిర్వాహకుడు కారి లక్ష్మణరావు మాట్లాడుతూ సింథటిక్ మ్యాట్‌పై జరిగే పోటీల్లో 28 జట్లకు చెందిన క్రీడాకారులు పాల్గొంటున్నారన్నారు. అనంతరం ఉక్కునగరం, గంగవరం జట్ల మధ్య జరిగిన పోటీలో ఉక్కునగరం 34–32 స్కోరుతో గెలుపొందింది. కార్యక్రమంలో రామ్మోహన్ కుమార్, చైతన్య, పవన్, కిరణ్ పాల్గొన్నారు.



పోటీల ప్రారంభ కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్ స్పోర్ట్స్ విభాగం సీజీఎం ప్రకాశ్

'సెయిల్ సహకారంతో బీఎఫ్–3 ప్రారంభించాలి'

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం సెయిల్ సహకారంతో బీఎఫ్–3ని వెంటనే ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని స్టీల్ సీఐటీయూ ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి డిమాండ్ చేశారు. శనివారం జరిగిన యూనియన్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్టీల్ సీఐటీయూ అభ్యర్థన మేరకు యూనియన్ జాతీయ ప్రధాన కార్యదర్శి తపన్‌సేన్ ఈ మేరకు సెయిల్ చైర్మన్‌కు లేఖ రాశారని తెలిపారు. అధ్యక్షుడు వై.టి. దాస్ మాట్లాడుతూ ఉద్యోగులకు సకాలంలో జీతాలు చెల్లించాలన్నారు. పి.శ్రీనివాసరాజు, అప్పారావు, వెంకటేశ్వర్లు, గంగాధర్, టి.వి.కె.రాజు తదితరులు పాల్గొన్నారు.